ఆటోలతో... తలపోటు

- నగరంలో అనధికారికంగా వెలుస్తున్న ఆటోస్టాండ్‌లు
- పట్టించుకోని కార్పొరేషన్, ట్రాఫిక్ అధికారులు
- మూడు వంతెనల వద్ద పనులతో మరిన్ని చిక్కులు
- రైల్వేగేట్‌ల వద్ద భారీగా నిలిచిపోతున్న వాహనాలు
- ప్రధాన రహదారుల్లోనూ.. ఇదే దుస్థితి
- ట్రాఫిక్ పాయింట్‌ల వద్ద కనపడని సిబ్బంది


ఏసీ కళాశాల ప్రధాన రహదారిలో నిలిచిన వాహనాలు

పట్నంబజారు: నగరవాసులను ట్రాఫిక్ చిక్కులు తొలగడం లేదు. అసలే గుంటూరు నగరం రద్దీగా మారిన క్రమంలో.. ఆటోలు మరింత తలపోటుగా మారాయి. నిత్యం ట్రాఫిక్ సమస్య... నిలిచిపోతున్న వాహనాలు.. పట్టించుకోని అధికారలంటూ.. నగర వాసులు గగ్గోలు పెడుతున్నా... అధికారుల తీరుతో నివ్వెరపోతున్నా.. సమస్యకు మాత్రం పరిష్కారం లభించటం లేదు.

పెరిగిన ఆటోలు...

గుంటూరు నగరంలో సుమారుగా 25 వేలకు పైగా ఆటోలు తిరుగతున్నాయి. నగరంలో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం అవుతున్నాయి. ఇబ్బడి ముబ్బడిగా అనధికారికంగా వెలుస్తున్న ఆటో స్టాండ్‌లు, అధికారుల పర్యవేక్షణ లోపం.. వెరసి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ సుమారుగా ఐదారు ఆటో స్టాండ్‌లు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఆటోలన్ని యథేచ్ఛగా రోడ్డుపైనే పెట్టి ప్రయాణికులకు ఎక్కించుకుని తిరిగిస్తున్నారు. అక్కడే ఆర్టీసీ ఇన్‌గేట్, విజయవాడ బస్‌స్టాఫ్ అవుట్‌గేట్ కూడా ఉన్న నేపథ్యంలో బస్సులు, ఆటోల వలన ట్రాఫిక్ మరింత జఠిలమవుతోంది. ఈ ప్రాంతాన్ని పరిశీలించాల్సిన ట్రాఫిక్ అధికారి కనీసం అందుబాటులో ఉండకపోవటం, ఉన్నా.. వారికి నిత్యం కేటాయించే వంద కేసుల టార్గెట్‌ను పూర్తి చేసుకోవటం తప్ప చేస్తోంది ఏమి లేదనే విమర్శలున్నాయి.

ఏప సెంటర్లలో..

సిబ్బందిని పెట్టి సరిచేయాల్సిన అధికారులు మైకులు పెట్టి.. మైకుల్లో చెబితే.. ఆటో వాలాలు వింటారా..? బ్రహ్మందరెడ్డి స్టేడియం, రాధాకృష్ణ థియేటర్ సెంటర్ (ఆర్కేటీ), హిమని కూల్‌డ్రింక్ సెంటర్, ఆకుకూరల మార్కెట్ వద్ద, కూరగాయాల మార్కెట్, నందివెలుగు రోడ్డు ఆర్టీసీ ఔట్ గేట్ వద్ద, ప్రభుత్వాసుపత్రి పరిసర ప్రాంతాలు, శంకరవిలాస్ సెంటర్, అరండల్‌పేట పదోలైను పరిసర ప్రాంతాలు, లాడ్జిసెంటర్, అమరావతి రోడ్డు, ఉల్ఫ్‌హాల్ గ్రౌండ్ సెంటర్, కొరిటిపాడు, లక్ష్మీపురం, గుజ్జగుండ్ల, జేకేసీ కళాశాల సెంటర్‌లలో ఆటోలను అడ్డగోలుగా నిలపవటం వలన మరన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాజ్‌సెంటర్‌లోని డీమార్ట్ వద్ద ఆటో స్టాండ్ పాయింట్ ఆటోలు రోడ్డును ఆక్రమించుకుని మరీ నిలబెడుతూ.. ఇదేమని ప్రశ్నిస్తే ఇష్టానుసారంగా దుర్భాషలాడుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఆటోస్టాండ్‌లపై కనీస చర్యలు తీసుకోవటంలేదనే విమర్శలు ఉన్నాయి. ఒక వేళ పట్టుకున్నా.. నార్మల్ ఫైన్స్ ఖాకీ చొక్కా లేదనో... ముందు సీట్లో ఎవరినైనా కూర్చొబెట్టుకున్నారనో జరిమానా విధించి పంపుతున్నారనే విమర్శలు లేకపోలేదు.

రైల్వే గేట్‌ల వద్ద.. ఇక చెప్పే పనేలా...

నగరంలో మూడు వంతెనల వద్ద రైల్వే పనులు జరుగుతున్న విషయం విదితమే. ఈ క్రమంలో ట్రాఫిక్ తీవ్రతరంగా మారుతోంది. ముఖ్యంగా రైళ్ల వెళ్లి వచ్చే సమయంలో గేటు పడ్డప్పుడు ప్రయాణికుల పరిస్థితి వర్ణాతీతం. కనీసం 40 నిముషాలకుపైగానే గేట్లు వద్ద నిలబడిపోవాల్సి వస్తోంది. నెహ్రూనగర్ రైల్వేగేటు, సంజీవయ్య నగర్ రైల్వేగేటు, నెహ్రూనగర్ 1వ లైనులో గేటు ప్రాంతాల వాసుల ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. ఇంత ట్రాఫిక్ సమస్య వేధిస్తున్నా.. కనీసం అక్కడ సిబ్బంది ఉండకపోవటంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఆటోవాలాలు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. ప్రయాణికులకు ఇబ్బందులకు గురి చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. ఇప్పటికే పలు మార్లు వారికి అవగాహన కలిగించాం. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే..చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటంతో పాటు, జరిమానాలు విధిస్తాం. నేరుగా జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో సమావేశం పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆటోవాలాలను కట్టడించేందుకు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటాం.

–ఎం.రమేష్, డీఎస్పీ, ట్రాఫిక్


సంజీవయ్యనగర్ గేటు వద్ద నిలిచిన ట్రాఫిక్

ఎంతెంతదూరం..

నగరంలోని హిందూ కళాశాల... నాలుగు రోడ్ల కూడలి నరకప్రాయంగా మారింది. మార్కెట్ మీదుగా శంకర్‌విలాస్ సెంటర్‌కు చేరుకోవాలంటే గంటకుపైగా పడుతోంది. ముఖ్యంగా సెయింట్‌జోసఫ్ ఆస్పత్రి ఉన్న ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ వద్ద సిబ్బంది, అధికారులు విధులు నియమించినా.. అక్కడ ఉండకుండా పక్కకు వెళ్లి పోలీసు విశ్రాంతి భవనంలో సిబ్బందితో కబుర్లు చెప్పుకుంటూ.. కూర్చొవటం, లేదా వారి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లిపోతున్న పరిస్థితులు కనపడుదుతున్నాయి. ఎత్తురోడ్డు సెంటర్ నుంచి హిందూ కళాశాల కూడలి దాటాలంటే... కనీసం 30 నిముషాలపై పడుతోదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంతటి ట్రాఫిక్ సమస్యలు ఉన్నా... పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు మాత్రం, కార్పొరేషన్ వేసి స్పీడు బ్రేకర్‌లను పరిశీలిస్తూ.. ఫోజులిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతాయం కలిగిస్తున్న ఆటోలపై ట్రాఫిక్, రవాణాశాఖ అధికారులు దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


సెయింట్‌జోసఫ్ ఆస్పత్రి పాయింట్‌లో లేని ట్రాఫిక్ సిబ్బంది


నాజ్‌సెంటర్‌లో రోడ్డుపై అడ్డంగా నిలిపిన ఆటోలు

నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి


బిల్డింగ్ ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు, డ్రెయిన్లపై నిర్మాణాలు చేయకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) జారీ చేయబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గోరంట్ల, రెడ్డిపాలెం ప్రాంతాల్లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను ఆదివారం కమిషనర్ పరిశీలించారు. సెట్ బ్యాక్, రోడ్డు కొలతలు, ర్యాంప్‌లు, డ్రెయిన్లపై ఆక్రమణలను తనిఖీ చేసి, తదుపరి అనుమతులకు సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భవనాలు నిర్మాణ దశలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిరంతరం పరిశీలిస్తూ, నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టకుంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి, నోటీసులు జారీ చేయాలని కోరారు. గ్రీనరీకి ప్లాన్‌లో చూపిన విధంగా ఉండాలన్నారు. వాచ్ మెన్ రూమ్ నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. అపార్ట్‌మెంట్ నిర్వాహకులే డ్రెయినేజీ లైన్‌ను మేజర్ డ్రెయిన్ వరకు కనెక్ట్ చేసుకోవాలని చెప్పారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రెహ్మాన్, మల్లికార్జున, టీపీఎస్‌లు లక్ష్మణ స్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సోషల్ మీడియా యాక్టివిస్టులకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూరిఫాతిమా


మాట్లాడుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: సోషల్ మీడియా యాక్టివిస్టులకు అన్నివిధాలా అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. మంగళదాస్ నగర్‌లోని ఆమె కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ భావ స్వేచ్ఛను తెలియపరిచే సోషల్ మీడియా యాక్టివిస్టులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నవారిని ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేసి అక్రమ కేసులు బనాయించడాన్ని ప్రతిఘటిస్తామని పేర్కొన్నారు. అక్రమ కేసులకు సంబంధించి పూర్తి స్థాయిలో న్యాయం అందేలాచూడడంతోపాటు, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమ కేసులు పెట్టినంత మాత్రానా ఏమాత్రం భయపడేది లేదని తేల్చిచెప్పారు. ప్రతి ఒక్కరికి తాను అండగా ఉంటానని, ఇప్పటికే వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సోషల్ మీడియా యాక్టివిస్టులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే వారికి అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో సోషల్ మీడియా యాక్టివిస్టులు సాగర్, రహమతుల్లా, రాంబాబు, కడియం ఆనంద్, నూనె వెంకట్, మెహబూబ్, ఫరీద్, వసంత్, డోంగ్లి, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ టెన్త్ మోడల్ పేపర్లు ఉపయుక్తం


మోడల్ పేపర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ ముద్రించిన టెన్త్ మోడల్ పేపర్లు పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో టెన్త్ మోడల్ పేపర్స్ బుక్‌లెట్‌ను సంఘ నాయకులతో కలిసి లక్ష్మణరావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా ప్రతి ఏటా పదో తరగతి విద్యార్థుల ప్రయోజనం కోసం యూటీఎఫ్ మోడల్ పేపర్లు తయారు చేసి పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన మెటీరియల్‌ను అందుబాటులోకి తెచ్చారని అన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు పుస్తకానికి ముందుబాట రాయడం అభినందనీయమని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ టెన్త్ మోడల్ పేపర్లు సోమవారం నుంచి తమ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ మారిన సిలబస్ ప్రకారం ఏడు పేపర్ల విధానంలో మోడల్ పేపర్లను రూపొందించామని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఎం.గోవిందయ్య, కె.రంగారావు, బెల్లంకొండ ప్రసాద్, కె. ప్రేమ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.ఏసోబు, గఫార్, బాజీబాబా, జె.రమేష్, రామకృష్ణ, కొండవీటి శ్రీనివాసరావు, గోపయ్య, ఆదాం సాహెబ్ పాల్గొన్నారు.

ట్రినిటి లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు



నగరంపాలెం: స్థానిక కొత్తపేట కుగ్లర్ ఆస్పత్రి ఆవరణలోని ట్రినిటి లూథరన్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ నిర్వహించారు. రెవ.డా.సిహెచ్ డానియేల్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తు జననం అనే నాటికను బాలబాలికలు ప్రదర్శించగా, కేక్ కట్ చేశారు. సంఘ కాపరులు రెవ.జె.దైవాశీర్వాదం, రెవ.పి.రమేష్ ప్రజల కొరకు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో బ్రదర్ ఎస్.మార్టిన్‌లూథర్‌కింగ్, బత్తుల లెనిన్, బి.గ్రేస్‌సుదర్శనం పాల్గొన్నారు.

లీడర్‌షిప్ శిక్షణ తరగతులను వాయిదా వేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సోమవారం నుంచి ఈనెల 19 వరకు నిర్వహించతలపెట్టిన ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ ట్రెనింగ్ కార్యక్రమాలను వాయిదా వేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు పేర్కొన్నారు. ఆదివారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో పెదబాబు మాట్లాడుతూ ఎస్ఏ-1 పరీక్షలు సోమవారం నుంచి జరగనుండగా, సరిగ్గా ఇదే సమయంలో శిక్షణ కార్యక్రమాలను చేపట్టడం తగదని తెలిపారు. ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులను శిక్షణ తరగతులకు హాజరు కావడం కష్టతరంగా ఉండే దృష్ట్యా, శిక్షణ తరగతులను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఒకేసారి పరీక్షలు, ఒకేసారి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం కష్టతరమవుతుందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

12వ వేతన సవరణ కమిటీని తక్షణమే నియమించాలి

ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా


సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

గుంటూరు మెడికల్: ప్రభుత్వం 12వ వేతన సవరణ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం గుంటూరు వైద్య కళాశాలలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. చాంద్ బాషా మాట్లాడుతూ ఇప్పటికే 11వ వేతన సవరణ కమిటీ ముగిసి 18 నెలలు అయినట్లు చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వం పీఆర్సీ కమిటీని ప్రకటించకపోవడం పోవడం శోచనీమని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఐఆర్ 28 శాతం వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లాలోని ఏడు తాలూకా యూనిట్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరిముల్లా షా ఖాదరి, జిల్లా కోశాధికారి పోతురాజు, జిల్లా ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, రహిమాన్, జిల్లా సంయుక్త కార్యదర్శి కోట సాహెబ్, శ్రీనివాసరావు, నగరశాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి సాంబశివరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమలత, కార్యదర్శి సుమిత్రా దేవి, గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం నాయకులు భరత్ కుమార్, హిదయతుల్లా పాల్గొన్నారు.

వివిధ రంగాల ప్రముఖులకు సత్కారం


సత్కారం పొందిన వారితో నిర్వాహకులు

నగరంపాలెం: సాహిత్య, సాంస్కృతిక రంగాలకు సేవలు అందిస్తున్న వారిని గత ఎనిమిదేళ్లుగా బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ ప్రోత్సహించడం అభినందనీయమని ఇస్రో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు అన్నారు. బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ జాతీయ స్థాయి కథల పోటీలో గెలుపొందిన వారికి ఆదివారం బ్రాడీపేట 2/7వ అడ్డరోడ్డులోని సీపీఎం జిల్లా కార్యాలయ ఆవరణలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. సీనియర్ కథా రచయిత శిరంశెట్టి కాంతారావు మాట్లాడుతూ ఈ పోటీలకు 184 కథలు వచ్చాయని అన్నారు. అందరూ సామాజిక స్పృహతో రచనలు చేశారని కొనియాడారు. పోటీల్లో గెలుపొందిన రోహిణి వంజారి, గంగవరపు సునీత, విజయశ్రీముఖి, అజయకుమార్, మొలకలపల్లి కోటేశ్వరరావులకు బహుమతులు అందించారు. ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బండికల్లు జమదగ్ని, శ్యామ్‌ప్రసాద్, విశాఖ సంస్కృతి' మాసపత్రిక సంపాదకులు శిరేల సన్యాసిరావు, ఉగ్గిరాల సీతారామయ్య, గంగవరపు సునీత, రావి రంగారావు, తూములూరి రాజేంద్రప్రసాద్, జానీభాషా ప్రసంగించగా, చందు సాంబశివరావును జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించారు.

బాలబాలికలకు భక్తి, చిత్రలేఖన పోటీలు


మాట్లాడుతున్న వెంకటలీలాసుందరి

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామ క్షేత్రం ఆవరణలో 98వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో బాలబాలికలకు వార్షిక కంఠ పాట, చిత్రలేఖనం, భక్తి పాటల పోటీలు జరిగాయి. కార్యనిర్వాహకులు రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు సుబ్బారావు, బి.జయశంకర్, బి.రామకృష్ణలు పోటీలను పర్యవేక్షించారు. రాగం వెంకట లీలాసుందరి మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు ఈనెల 19న సంఘ వార్షిక సభలో బహుమతులు అందిస్తామని చెప్పారు. పాఠశాలల నుంచి బాలబాలికలకు యోగదా చారిటబుల్ ట్రస్ట్ తరుపున ప్రసాదాలు, భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. 0863-2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని కోరారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చర్మ వ్యాధులను నిర్లక్ష్యం చేయకూడదు



గుంటూరు మెడికల్: దీర్ఘకాల మధుమేహం, అధిక రక్తపోటు బాధితులలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండటం వలన అనేక సూక్ష్మజీవ చర్మవ్యాధులు ఎక్కువగా వస్తాయని వాటిని నిర్లక్ష్యం చేయకూడదని డాక్టర్ డి.అమర్ అన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ అమర్ మాట్లాడుతూ మధుమేహ బాధితులు స్వేచ్ఛగా అన్ని రకాల ఆహారాలు తీసుకోకపోవడం, వివిధ రకాల మధుమేహ, రక్త పోటు మందులు వాడటం, వివిధ రకాల క్రీములువాడడం, వయసు కారణంగా రోగ నిరోధక శక్తి తగ్గిపోవడం జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ చర్మం పరిరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చర్మం లో ఏదైనా అసాధారణ మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమానికి సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి.సేవకుమార్ అధ్యక్షత వహించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ సిహెచ్.చైతన్య, ఎస్ హెచ్ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ఎస్.సాంబశివరావు, జి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గుంటూరు ఘాట్ టాలెంట్ షో ప్రారంభం



గుంటూరు మెడికల్: సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షేక్ షమా సుల్తానా ఆధ్వర్యంలో గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఎం కన్వెన్షన్ హాల్లో గుంటూరు ఘాట్ టాలెంట్ షో కాంపిటీషన్స్, పాటలు, డ్యాన్స్, స్టాండ్ అప్ కామెడీ, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫ్యాషన్ షో, మెహందీ, పోయట్రీ, ఫన్నీ ఆర్ మెసేజ్ ఓరియంటెడ్ స్కిట్ లాంటి పోటీలను ఆదివారం ప్రారంభించారు. సలాం నమస్తే గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ గుంటూరు ఘాట్ టాలెంట్ షో కాంపిటీషన్స్ పూర్తయిందన్నారు. ఈనెల 15 సెమీ ఫైనల్స్, ఈనెల 22న ఫైనల్స్ ఉంటాయని తెలిపారు. ఈనెల 26న ఎస్ఎస్‌జీఎస్ ఇనాగ్రేషన్, జీజీటీ అవార్డ్స్ అండ్ కల్చరల్ నైట్ విజ్ఞాన మందిరంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గుంటూరు ఘాట్ టాలెంట్ షో సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందజేయడం జరిగిందన్నారు. సెమీఫైనల్స్, ఫైనల్స్ పోటీలో పాల్గొంటున్న ప్రతి ఒక్కరికి ఆల్ ది బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో షేక్ కరీం, డాక్టర్ సారిక, డాక్టర్ వహీద్, అనిల్ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కో హోస్ట్ రజాక్, అల్లాబక్షు, మేనేజర్ నాగేశ్వరావు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: కుటుంబ సభ్యుల ఆదరణ కరువైన వయోవృద్ధులు, దివ్యాంగులకు సమితి తరపున సహాయ, సహకారాలు అందిస్తున్నామని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో నెలనెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది అందరూ ఉండి కూడా ఒంటరి జీవనాన్ని గడుపుతున్నారని అన్నారు. అటువంటి వారిని గుర్తించి, నెలనెలా తమ వంతుగా నిత్యావసరాలను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి మాదాల ప్రకాష్, ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పోలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శులు పలకలూరి శివరావు, టి.మురళీసాయి, పీవీ సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్‌వీ.రమణ, పోలేపల్లి లహరి పాల్గొన్నారు.

కమ్మ హాస్టల్ పూర్వ విద్యార్థిగా గర్విస్తున్నా..


ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును సత్కరిస్తున్న సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: శతాబ్ద కాలానికిపైగా పేద విద్యార్థులకు ఉచిత భోజన, వసతులు సమకూర్చి, ఉన్నత విద్యావంతులుగా ఎదిగేందుకు కృషి చేస్తున్న కమ్మ హాస్టల్ పూర్వ విద్యార్థిగా చెప్పుకునేందుకు ఎంతో గర్వపడుతున్నానని వినుకొండ ఎమ్మెల్యే, శాసన సభ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని శాఖమూరి మహాదేవమ్మ కమ్మ హాస్టల్ పాలకమండలి, పూర్వ విద్యార్థుల సంఘ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును సత్కరించారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కమ్మ హాస్టల్ రుణాన్ని జన్మజన్మలకు తీర్చుకోలేనని అన్నారు. డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య వంటి పెద్దల సారథ్యంలో కమ్మ హాస్టల్లో తనలాంటి వేలాదిమంది విద్యార్థులు చదువుకుని దేశ, విదేశాల్లో ఉన్నత రంగాల్లో రాణించటం గర్వంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు రూ.ఎనిమిది లక్షల ఇరవై ఒక్క వేలతో పాటు పూర్వ విద్యార్థి సంఘం తరపున రూ.రెండు లక్షలు, కార్యదర్శి మందలపు బంగారు బాబుకు అందజేశారు. ఈసందర్భంగా హాస్టల్ అభివృద్ధికి ప్రతి యేటా రూ.ఐదు లక్షలు ఇస్తానని జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొరప్రాటి రామారావు, బొల్లేపల్లి శ్రీనివాసరావు, పాలేటి శ్రీనివాసు, గడ్డిపాటి సుధాకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అన్నమయ్య సంకీర్తన లహరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం సాయంత్రం అన్నమయ్య సంకీర్తన లహరి నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉషా రాణి బృందంతో గణపతి, అన్నమయ్య శ్లోకాలు, ఆదిమూలమే, వేదం వేపని పెరిగినాడు, గోవిందా గోవిందా, అప్పని వరప్రసాది, అంతయు నీవే, నగదరా నందగోపాల, తిరు వీధులకు మెరిసిని, వాడ వాడల వెంట, జయ మంగళం అంటూ పలు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించగా, అలరించాయి. వయోలిన్‌పై పాలేటి గోవర్ధన్‌రావు, మృదంగం కేవీ కిషోర్ వాయిద్యాన్ని అందించారు.